క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కడప అర్బన్ : కడప డీఎస్పీగా ఏ. వెంకటేశ్వర్లు సోమవారం కడప సబ్ డివిజనల్ అధికారి కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తమ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా, సీఐగా కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలలో పని చేశారు. 2005లో సీఐగా పదోన్నతి పొందారు. తరువాత డీఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలులో సీబీడీలో డీఎస్పీగా పనిచేస్తూ కడప డీఎస్పీగా బదిలీ అయ్యారు.

టవర్ నిర్మాణానికి అనుమతులను నిలుపుదల చేయాలి

కడప రూరల్ : కడప నగర పరిధిలోని సింగపూర్ టౌన్ షిప్‌లో సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు నిలుపుదల చేయాలని ఆ కాలనీ వాసులు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ సింగపూర్ టౌన్ షిప్‌లో ఇల్లు లేనప్పటికీ ఒకతను స్వయం ప్రకటిత అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారన్నారు. 2015 జూన్ 30వ తేదీన ఏపీ హౌసింగ్ బోర్డు వారు కాలనీలోని ఖాళీ స్థలాలను కార్పొరేషన్‌కు అప్పగించారన్నారు. ఆ కార్పొరేషన్ స్థలంలో స్వయం ప్రకటిత అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి నెలకు రూ. 12 వేల చొప్పున సెల్ టవర్ ఏర్పాటుకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ స్థలంను సెల్ టవర్ ఏర్పాటుకు ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దుస్తుల పంపిణీ



నూతన వస్త్రాలు అందుకున్న వృద్ధులతో దాతలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : దసరా పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ విజిలెన్స్ కానిస్టేబుల్ ఎర్రంరెడ్డి సూర్యలక్ష్మి, శ్వేతారెడ్డిలు హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని స్నేహాలయ, ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలోని వారికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, సభ్యులు రవి, ప్రసన్నకుమార్, శ్వేతారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌ను తనిఖీ చేసిన జడ్జి



హాస్టల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం కడప నగరంలోని ప్రకాష్‌నగర్ స్కూల్, కాలేజీకి సంబంధించిన బీసీ హాస్టల్‌ను, బాలాజీనగర్, కో–ఆపరేటివ్ కాలనీలలోని బీసీ హాస్టల్‌లను తనిఖీ చేశారు. వంటశాలను, వసతిగదులను, స్టోర్ రూమ్‌లను, పరిసరాలను పరిశీలించారు. తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్: 15100, మొదలైన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో బీసీ హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో ఎవరూ దిగవద్దు

సిద్దవటం : అల్పపీడన ప్రభావంతో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ పెన్నా నదీ పరీవాహక ప్రాంతాలైన వెంకటాయపల్లె, పి.కొత్తపల్లి, జ్యోతి గొల్లపల్లి, వంతాటిపల్లె, ఎస్. రాజంపేట, సిద్దవటం, జంగాపల్లె, వెలుగుపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె, టక్కోలు, మాచుపల్లె మూలపల్లె, సంటిగారిపల్లె గ్రామాల ప్రజలు పెన్నానదిలోకి ఎవరూ దిగకూడదన్నారు. పెన్నా నదిలో సుడిగుండాలు గుంతలు ఉన్నాయని పెన్నానదిలోకి దిగి ప్రమాదాలను తెచ్చుకోవద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమించి పెన్నానదిలోకి దిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల ఇద్దరు పెన్నానదిలోకి దిగి మృత్యువాత పడ్డారన్నారు. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలని తెలిపారు.

వర్షాలపై డీటీ సమీక్ష

సిద్దవటం : మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న నివాస గృహాల సమాచారాన్ని వీఆర్‌ఓలు వెంటనే తెలపాలని డిప్యూటీ తహసీల్దారు మాధవీలత అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన గృహ నిర్మాణదారులు స్థానిక గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓలకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే వర్షాల కారణంగా పంట పొలాలు దెబ్బతిని ఉంటే ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని ఆమె అన్నారు.

వరిలో యాజమాన్యం..
అధిక దిగుబడికి మార్గం



వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకున్న రైతులు



కడప నగర పరిధిలో వరి పొలం పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

కడప అగ్రికల్చర్ : వరిపంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులను.. ముఖ్యంగా ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ అధికారులు తెలియచేస్తున్నారు. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పెన్నానదికి నీరు రావడంతో కడప మండల పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతాల్లో వరిపంటను సాగు చేశారు. తరువాత కురిసిన వర్షాలకు పాతకడప చెరువు కూడా నిండడంతో 750 హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో వరిపంట సాగు చేశారు. దీంతోపాటు మరో 60 హెక్టార్లకుపైగా ఆరుతడి పంటలైన మినుము, కొర్ర, వేరుశనగ, మామిడి సాగులో ఉన్నాయి.

కడప నియోజకవర్గంలో రైతుల సంఖ్య	: 4,639
సాగుకు అనుకూలమైన భూమి హెక్టార్లలో	: 820
ప్రస్తుతం సాగైన వరిపంట హెక్టార్లలో	: 756
సాగైన మినుము, కొర్ర, వేరుశనగ పంటలు హెక్టార్లలో	: 54

వరిపంట సాగుకు అయ్యే ఖర్చు ...

- ఎకరా వరిపంటకు నారుకు విత్తనాలకు రూ. 1000
- సేద్యం ఖర్చులు రూ. 4 నుంచి 5 వేలు
- సాగుకు, గట్లు పెట్టేందుకు కూలీల ఖర్చు: రూ.6 వేలు
- ఎరువుల ఖర్చు: రూ.3,500 నుంచి రూ.4 వేలు

కాలిబాటలతో చీడ పీడలకు దూరం...

వరినాట్లు వేసిన రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు కాలిబాటలు ఏర్పాటు చేసుకున్నారు. కడప మండల పరిధిలో 1850 ఎకరాల్లో వరిపంట సాగయింది. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ వరిపంటకు ఆకుముడత తెగులు కొద్దిగా కనిపిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. దీంతోపాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై అధికారులు రైతులకు సూచనలు, సలహాలను ఇస్తున్నారు. ముఖ్యంగా వరి సాగులో యాజమాన్య పద్ధతులు ప్రధాన పాత్ర పోషిస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కాగా.. నదీ పరివాహక ప్రాంతంలో ముందుగా సాగు చేసిన వరిపంట ప్రస్తుతం కోతకు వచ్చింది. ఇలా దాదాపు 100 ఎకరాల్లో వరి ప్రస్తుతం కోతకు వచ్చింది.

కాలిబాటల వల్ల కలిగే లాభాలు...

- వరిపంటను సాగు చేసిన రైతులు తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలి.
- కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల మొక్కలకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు రాకుండా ఉంటాయి.
- కాలిబాటలు ఏర్పాటు వల్ల పురుగుమందులు పిచికారిని సులభంగా చేసుకోవచ్చు. ప్రతి మొక్కపైనా మందు పడేందుకు వీలుంటుంది. దీంతోపాటు ఎరువులను సులభంగా చల్లుకునేందుకు వీలుంటుంది.
- కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వరిమడిలో భూమిని తడి లేకుండా సులభంగా ఆరబెట్టేందుకు వీలవుతుంది.
- వరికోత సమయంలో కూడా సులభంగా కోతలు కోసుకునేందుకు వీలుంటుంది.

వరి నాటిన వారంలోపే...



వరినాటిన వారంలోపే కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటాం. కాలిబాటలు ఏర్పాటు చేసుకోక పోవడానికి, ఏర్పాటు చేసుకునే దానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల వరిలో వచ్చే తెగుళ్లను సులభంగా నివారించుకోవచ్చు. దీంతో మందుల ఖర్చు కూడా తగ్గించుకోవచ్చు. కాలిబాటలను ఏర్పాటు చేసుకోకపోతే మొక్కకు గాలి వెలుతురు సరిగా తగలక తెగుళ్ల ఉధృతి ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది.
– నాగేశ్వరరెడ్డి, రైతు, పాత కడప.

అవగాహన కల్పిస్తున్నాం...



వరినాటిన వారం రోజుల నుంచి పంటలను పరిశీలిస్తున్నాం. రైతులకు సూచనలు, సలహాలను అందిస్తున్నాం. దీంతోపాటు పంటలు సాగు చేసిన రైతులందరికీ ఈ క్రాపును కూడా నమోదు చేశాం. దీంతోపాటు ముఖ్యంగా ఎరువుల యాజమాన్యంపై తగిన సూచనలు అందిస్తూ వారికి సహకరిస్తున్నాం.
– పావని, వ్యవసాయ విస్తరణ అధికారి, కడప.

అక్కడక్కడ ఆకుముడత సోకుతోంది..



ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ ఆకుముడత సోకుతోంది.. దీని నివారణకు రైతులకు సూచనలు, సలహాలను ఇస్తున్నాము. ఇందులో ఆకుముడతకు ఎకరాకు 200 లీటర్ల నీటికి 200 గ్రాముల అస్పెట్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా ఆకుముడతను నివారించుకోవచ్చు.
– సురేష్‌కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, కడప

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజుల్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు. ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

వల్లూరు (చెన్నూరు) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పురుషోత్తమరాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నది పరివాహ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పెన్నా నదిలోకి దిగవద్దని తెలిపారు. మూడు రోజులపాటు వర్ష సూచనల నేపథ్యంలో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతంలో అధికంగా వర్షాలు పడ్డాయని, పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలకు సమస్య వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. కొత్త వ్యక్తులు ఎవరైనా నది పరివాహక ప్రాంతాల్లో సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు.

భాగవత పఠనం

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో వెలసిన సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం భాగవత పఠన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో భక్తి శ్రద్ధలతో పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత మండలి సభ్యులు భాగవత పఠనం చదువుతున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో తులతూగాలని కోరుతూ ఆలయంలో ఏడు రోజులపాటు భాగవత పఠనం చదువుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీఎస్సీలో ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో 5,050 మంది ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ బి.గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలని, ఈ నెల 21వ తేదీ లోపల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులకు మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.

రైతు బజార్‌లో స్పెషల్ కౌంటర్ ఏర్పాటు



ఆయిల్ ప్యాకెట్స్ అందజేస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్ : ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ ఆదేశాల మేరకు సోమవారం కడపలోని రైతు బజార్‌లో తక్కువ ధరకు వంట నూనె అందించేందుకు స్పెషల్ కౌంటర్ ఏర్పాటు చేశారు. సంబంధిత కౌంటర్‌ను ఏఎస్ఓ తారకనాథరెడ్డి, కడప ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 850 మి.లీ. పామాయిల్ ప్యాకెట్‌ను రూ. 110కి, 910 మి.లీ. సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.124 ఈ కౌంటర్ ద్వారా అందించనున్నామని తెలిపారు. ఈ కౌంటర్ ద్వారా రేషన్‌కార్డుకు మూడు పామాయిల్ ప్యాకెట్స్, ఒక సన్‌ఫ్లవర్ ప్యాకెట్‌ను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్‌లో డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ ఆడ బిడ్డను రక్షించాలంటే లింగ నిర్ధారణ జరగకుండా చేయాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా చూడాలని, ఎవరైనా స్కానింగ్ సెంటర్ వారు లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే కమిటీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. చాలా మంది కుటుంబంలోని పెద్దల ఒత్తిడి కారణంగా ఆడ శిశువు అని తెలియగానే గర్భ స్రావానికి సిద్ధమవుతున్నారన్నారు. తల్లిదండ్రులు ఆడ బిడ్డ అయినా మగ బిడ్డ అయినా సమానంగా చూసుకుని మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగరంలో వర్షం



జలమయమైన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

కడప కార్పొరేషన్ : దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రమైన కడపలో కూడా సోమవారం తెల్లవారుజాము నుంచి తుంపరతో మొదలైన వాన సాయంత్రం వరకూ కురుస్తూనే ఉండటంతో వివిధ పనుల నిమిత్తం బయటికి రావాల్సిన వారు ఇబ్బందులు పడ్డారు. దసరా సెలవులు పూర్తయి సోమవారమే పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్నాయి. వర్షానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. గురుకుల్ విద్యాపీఠ్, ఫక్కీరుపల్లెకు పోయే మార్గాల్లో, వినాయకనగర్ సర్కిల్ ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలిచింది. నగర శివారు ప్రాంతాలైన వరదకాలనీ, సాగర్ కాలనీ, తిలక్ నగర్, శాంతినగర్, ఆర్‌కే నగర్, ఎస్‌బీఐ కాలనీ, గంజికుంట కాలనీ, గౌస్ నగర్ ప్రకాష్‌నగర్, ఓంశాంతినగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. మట్టిరోడ్లన్నీ బురదమయం అయ్యాయి. వర్షం వల్ల కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రుచికరమైన భోజనాన్ని అందించాలి



హెచ్‌ఎంతో కలిసి పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారమే కాకుండా రుచికరంగా అందించాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి సూచించారు. సోమవారం కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన ఏజెన్సీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీనగర్ పాఠశాలలో గతంలో ఇస్కార్ వారు భోజనాన్ని సరఫరా చేసే వారన్నారు. వాళ్లు సరఫరా చేసే అన్నం సరిగా లేక పోవడంతోపాటు చప్పగా ఉంటుందని పిల్లలు తెలిపారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు వంట ఏజెన్సీని ఏర్పాటు చేసి భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పకుమారి, డివిజన్ ఇన్‌చార్జులు రంజిత్, మోహన్‌రెడ్డి, బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా



పంట నమోదు జాబితాను చూసుకొంటున్న రైతులు

వీరపునాయునిపల్లె: ఖరీఫ్ సీజన్ సాగు చేసిన పంటల నమోదు జాబితా మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం అలిదెన రైతు సేవా కేంద్రంలో జాబితాను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసి నమోదు చేయించుకొన్న ప్రతి రైతు తమ పేరు. సాగు చేసిన పంట వివరాలు, విస్తీర్ణం జాబితాలో సక్రమంగా ఉందా లేదా అని చూసుకోవాలని సూచించారు. పొరపాట్లు ఉంటే ఈ నెల 16వ తేదీలోపు సంబంధిత వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. తుది జాబితాను ఈ నెల 18న అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించడంతో పాటు గ్రామ సభలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

వర్షాల నుంచి పంటలను కాపాడుకొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని శ్యామ్‌బాబు సూచించారు. వరి పంట సాగు చేసిన రైతులు పొలంలో నీరు ఎక్కువగా నిలువ ఉండకుండా బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎరువులు వేయకూడదని అవసరమైతే వర్షాలు తగ్గిన తరువాత వేసుకోవాలని తెలిపారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారిని లేదా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష చంద్ర

కడప కార్పొరేషన్ : ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 16 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి–6, రెవెన్యూ–5, టౌన్‌ప్లానింగ్–3, హెల్త్ విభాగం–1, ఎడ్యుకేషన్–1 వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని ఏడీసీ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన..

సోమవారం ఉదయం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అడిషనల్ కమిషనర్ నాగరాజుపేట, జెడ్పీ ఆఫీసు, ఎర్రముక్కపల్లె ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. జెడ్పీ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్ చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



మృతురాలి కార్నియాలను సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తదితరులు

పులివెందుల టౌన్ : నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో నివాసముంటున్న నగ్రాల ఆదిలక్ష్మమ్మ (83) మరణించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్ర సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో రాజు సిబ్బందితో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించినా నేత్రదానంపై అవగాహన కల్పించి 9966509364 లేదా 7093204537 నంబర్‌లకు సమాచారం ఇచ్చి అంధ రహిత సమాజానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు హేమ శిఖరాలరెడ్డి, అరుణదేవి, జయలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, తులశమ్మ, వెంకటరెడ్డి, రామపుల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామశేఖరరెడ్డి ఉన్నారు.

సగిలేరు వెలవెల.. రైతన్న విలవిల



నీరులేక వెల వెల బోతున్న సగిలేరు

అట్లూరు : జీవనదిలా ప్రవహించే సగిలేరు నీరులేక వెలవెలబోతోంది. వేలాది ఎకరాల్లో పంట వేసుకోలేక రైతు విలవిలలాడిపోతున్నాడు. నల్లమల అటవీ ప్రాంతంలో పుట్టిన సగిలేరు కలసపాడు, కాశినాయన, బికోడూరు, పోరుమామిళ్ల, బద్వేల్ మండలాల మీదుగా ప్రవహిస్తూ అట్లూరు మండలం మల్లినేనిపట్నం వద్ద పెన్నానదిలో విలీనమవుతుంది. అట్లూరు మండలం నడిబొడ్డున ఏరు ప్రవహిస్తోంది. నదికి ఒక వైపు ఆరు, మరోవైపు ఆరు పంచాయితీ గ్రామాలున్నాయి. ఏరులో నీరు పుష్కలంగా ఉంటే.. ఇరువైపులా వేలాది ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. అయితే ఇటీవల నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి ఖరీఫ్ సీజన్ దాటిపోయింది. రబీ ప్రారంభమవుతున్నా. వర్షం జాడలేదు. దీంతో సగిలేరు ఒట్టిపోయింది. గత ఏడాది వరకూ జీవనదిలా ప్రవహించినా.. ఈ ఏడాది అక్టోబరు నెలలో చుక్క నీరు చేర లేదు. పంట ఎలా సాగు చేయాలో తెలియక రైతులు దిగాలు పడుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి బ్రహ్మసాగర్ నుంచి అయినా సగిలేరుకు నీరు వదలాలని కోరుతున్నారు.

బ్రహ్మసాగర్ నీరు వదలాలి



వర్షాలు లేక సగిలేరు నది ఎడారిలా మారింది. మా పొలాలు బీడుబారాయి. అధికారులు స్పందించి బ్రహ్మసాగర్ నుంచి సగిలేరు నదికి నీరు వదలాలి. లేకపోతే మా పొలాలు పంటలకు నోచుకోక పశుగ్రాసానికి, తిండి గింజలకు ఇబ్బంది పడాల్సిందే.
మద్దిక చిన్నమునిరెడ్డి, రైతు, పెద్దకామసముద్రం, అట్లూరు మండలం

కరవు మండలంగా ప్రకటించాలి



ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ మొదలవుతున్నా వర్షం జాడే కనిపించలేదు. కనీసం సగిలేరు నదిలో నీరున్నా పైర్లు సాగు చేసుకునేవాళ్లం. వర్షం రాక..నీరు లేక పొలాలు బీడుబారాయి. కరవు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి.
సగిలి ఈశ్వరరెడ్డి, రైతు, కోనరాజుపల్లి, అట్లూరు మండలం